# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-08-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో గనుల శాఖ పని తీరుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమీక్ష నిర్వహిస్తున్నారు.**
2. **మహిళల కోసం స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.**
3. **బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి.**
4. **వర్షాల నేపథ్యంలో అధికారులు సహాయక చర్యలు చేపట్టాలని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు.**
5. **విదేశాలకు వెళ్లే యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో డేటా సిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి నారా లోకేష్ కోరారు.**

==========================

రాష్ట్రంలో గనుల శాఖ పని తీరుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో ఖనిజ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి వంటి అంశాలపై చంద్రబాబు నాయుడు సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సిఆర్డిఎ అథారిటీ సమావేశంలో పాల్గొంటారు. కాగా ఉపరాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి ఈ రోజు రాత్రి ఢిల్లీ బయలు దేరి వెళ్లనున్నారు.

---------------------------

మహిళల కోసం స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆమె ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మరిన్ని ఆర్టీసీ బస్సులను నడుపుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో 2 కోట్ల మందికి పైగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిందని పేర్కొంటూ...

.. వాయిస్.. 30 సెకన్లు

---------------------------

బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని ఇది మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. అలాగే ఉమ్మడి కోస్తాంధ్ర జిల్లాలతో పాటు తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మీ తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

మరోవైపు అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని జలుమూరు, ఎల్.ఎన్.పేట, వజ్రపుకొత్తూరు, ఆమదాలవలస, సరుబుజ్జిలి, కొత్తూరు, లావేరు, కవిటి, కంచిలి మండలాల్లో భారీగా వర్షం కురుస్తోంది. వర్షం నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈ రోజు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు జిల్లా అధికారులు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాల యంత్రాంగాన్ని మంత్రి కె.అచ్చెన్నాయుడు అప్రమత్తం చేశారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు.

-----------------------------

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టాలని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వర్షాల పరిస్థితిపై మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే రోడ్లపై నీరు నిలవకుండా అవసరమైన యంత్రాలు ఏర్పాటు చేసి నీటిని తొలగించాలన్నారు. విజయవాడలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు సిబ్బందికి తగిన ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు.

-----------------------------

ఏలూరు జిల్లా, ముసునూరు నియోజకవర్గంలో 135 మందికి 83 లక్షల 25 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నిన్న అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతోందని చెప్పారు. సదుపాయాల కల్పనకు ప్రాధ్యాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులను చేపడుతోందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

-----------------------------

రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు డి. ప్రసాదరావు తెలిపారు. తిరుపతి జిల్లా నగరిలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ సభలో స్థానిక పుత్తూరు శాసన సభ్యులు గాలి భానుప్రకాష్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ,

వాయిస్ 22 సెకన్లు

-----------------------------

ఉద్యోగాల కోసం ఇతరదేశాలకు వెళ్లే యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు విశాఖపట్నంలో డాటా సిటీ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌తో మంత్రి నారా లోకేష్ ఈరోజు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... విశాఖపట్నంలో డాటా సిటీని అభివృద్ధి చేయడం వల్ల భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ హబ్‌గా మారుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వెళ్లే కార్మికుల సంక్షేమం, భద్రత కోసం ప్రవాస భారతీయ బీమా యోజన వంటి పథకాలను విస్తరించాలని ఫిర్యాదుల పరిష్కారం కోసం రాష్ట్రంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

-----------------------------

శ్రీ సత్యసాయి జిల్లాలో ఈ రోజు జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. జిల్లాలోని తనకల్లు మండలం మండిపల్లి వద్ద తిరుమల నుంచి బళ్లారి వెళ్తున్న భక్తుల వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా మరో ఐదుగురికి తీవ్రగాయాలైయ్యాయని చెప్పారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని మృతుల పూర్తి వివరాల తెలియాల్సి ఉందని పోలీసు అధికారులు వివరించారు.

-----------------------------

గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతానికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు-పీఏసీఎస్ దోహదపడుతున్నాయని మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి పీఏసీఎస్ చైర్మన్, కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, రైతులకు గ్రామీణ బ్యాంకింగ్, బ్యాంకింగేతర సేవలు, వ్యవసాయ రాయితీలు వంటి అంశాలలో సహకార సంఘాలు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. రైతులకోసం ప్రభుత్వం అందించే పథకాలు సద్వినియోగం చేసుకునేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు.

-----------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 846 పాయింట్ల లాభంతో 81 వేల 455 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 304 పాయింట్ల లాభంతో 24 వేల 935 వద్ద ట్రేడవుతోంది.

=====================